కొటేషన్లు రాసుకుంటారు..
కండిషన్లు పాటించరు!


ఆటోలో నలుగురు కంటే ఎక్కువ ప్రయాణికులు ఉన్న దృశ్యం

కుత్బుల్లాపూర్: ఆటో డ్రైవర్లు మంచి మంచి కొటేషన్లు రాసుకుంటారు. కానీ కండిషన్లు పాటించడంలో చాలా మంది డ్రైవర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. డ్రైవర్‌తో కలిపి మొత్తం నలుగురు మాత్రమే ప్రయాణించాల్సిన ఆటోలో ఏకంగా 8 మంది వరకు ఎక్కిస్తున్నారు. ఆటోలో ప్రయాణికులు ఎక్కువైతే అదుపు తప్పి ఆటోలు బోల్తా పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ ఆటో డ్రైవర్లు మాత్రం అప్రమత్తం కావడం లేదు. డబ్బు సంపాదన మీద దృష్టి సారించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తొందరగా గమ్య స్థానం చేరాలన్న ప్రయాణికుల అవసరం సైతం ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యానికి కారణమవుతోంది. సుచిత్ర నుంచి మేడ్చల్ వైపు ఆదివారం ఓ ఆటోలో వెనుక నలుగురు ముందు నలుగురు కూర్చుని ప్రమాదకరంగా వెళ్తున్న దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది.


పూరీ జగన్నాథ్ ఆలయంలో విద్యార్థులు

బంజారాహిల్స్: ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షల సందర్భంగా జూబ్లీహిల్స్ భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమం పదో తరగతి విద్యార్థులు బంజారాహిల్స్‌లోని పూరీ జగన్నాథ్ టెంపుల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు. పరీక్షల్లో మంచి మార్కులు రావాలని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో హాజరుకావాలని సూచించారు.

అలుముకున్న చీకట్లు..
పట్టదంటూ అధికారులు!



9బీ పార్కులో విద్యుత్ దీపాలు లేక అంధకారంలో పార్కు


నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బండారి లేవుట్‌లోని 9బీ పార్కులో విద్యుత్ దీపాలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. అంతే కాకుండా పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో పరికరాలు మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారింది. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

– నిజాంపేట్

అధికారులు నిర్లక్ష్యం వీడాలి
ప్రభుత్వ స్థలం కాపాడాలి

- స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడంలో తాత్సారం
- కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అధికారులు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నవిస్తున్న బస్తీవాసులు


2007లో అప్పటి తహసీల్దార్ ఇచ్చిన లేఅవుట్


2021లో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ లేఅవుట్


2013లో స్థలం పరిరక్షకు హద్దులు పాతుతున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

చింతల్: ప్రభుత్వాలు మారినా... అధికారులు మారిన ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతుంది. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలం కొన్నేళ్లుగా కబ్జాకు గురవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. 2007లో తహసీల్దార్, 2019, 23లో జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొలతలతో కూడిన లే-అవుట్ ఇచ్చి నిధులు మంజూరు చేసినా ఇప్పటికి ఫెన్సింగ్ పనులు పూర్తి చేయలేదు. ఫిర్యాదు చేస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇంజినీరింగ్ అధికారులపై వారు వీరిపై నెట్టేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

నిధులు మంజూరైనా ఫెన్సింగ్ వేయని వైనం..

ఇటీవల ఈ స్థలంపై 'సాక్షి'దిన పత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఆ ఒక్క రోజు హడావిడి చేసిన గాజులరామారం డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు రాగా ధోబీఘాట్ వాసులు అడ్డుకోవడంతో వెనుదిరిగి మరలా ఫెన్సింగ్ వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు కబ్జాదారులకు లబ్ది చేకూరేలా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 1994లో చేపట్టిన సర్వే ఆధారంగానే ధోబీఘాట్ స్థలానికి హద్దులు పాతారు. అనంతరం 2019లో మరలా సర్వే చేసి ప్రభుత్వ స్థలం 3553.6 చ.గజాలుగా ఉన్నట్లు తేల్చారు. ఈ క్రమంలో అనేక పర్యాయాలు ఫెన్సింగ్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరవుతున్నా ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతూనే ఉంది.

పత్తాలేని భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం, జేఏసీ

ఈ విషయంలో ఓట్లు వేసి గెలిపించుకున్న సంక్షేమ సంఘం నేతలు అటువైపు కన్నెత్తి చూడలేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రభుత్వ స్థలంలో పాఠశాల నిర్మాణం అంటూ హడావిడి చేసి ఓ జేఏసీగా ఏర్పడి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం, జేఏసీ నాయకులు పత్తాలేకుండా పోతున్నారని చెబుతున్నారు.

అధికారుల రూటే సెపరేటు'...

ధోబీఘాట్- స్టార్‌లైట్ వెనుక ఉన్న సుమారు 30 గుంటల ప్రభుత్వ స్థలం గుండా పక్కన ఉన్న బస్తీలకు వెళ్లేందుకు దారి అని చెబుతూ (ప్లాట్లు చేసి అమ్ముకోవడం కోసం) టెండర్లు వేసి సీసీరోడ్లు వేయించారు. అవసరం ఉన్న చోట ఫెన్సింగ్ వేయకుండా అవసరం లేకపోయినా రోడ్డు వేసిన అధికారల తీరు పలు అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. గతంలో ధోబీఘాట్ అభివృద్ధి కోసం అంటూ ప్రభుత్వ స్థలాన్ని ధోబీఘాట్ వాసులు 1997లో 3గుంటలు మసీదుకు, 100 గజాల స్థలాన్ని ఓ వ్యక్తికి అమ్మి సొమ్ము చేసుకున్నట్లు భగత్‌సింగ్‌నగర్ వాసులు పేర్కొంటున్నారు.

> **ఎంత విడ్డూరం.?**
> సర్వే నంబర్ 155 ఒకటే అయినప్పటికీ జీఓ.58 ప్రకారం ధోబీఘాట్ వాసులకు తొమ్మిదేళ్ల క్రితమే పట్టాలు మంజూరు చేశారు. అయినా భగత్‌సింగ్ నగర్ ప్రజలకు ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వకుండా తాత్సారం చేయడం గమనార్హం.

మొత్తం 7 ప్లాట్లు..

ఇటీవల ధోబీఘాట్ వాసులు, కొంత మంది భగత్‌సింగ్‌నగర్ వాసులు, ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఓ పార్టీ నేత, అతడి అనుచరులు కలిసి మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. 2007లో ఇచ్చిన లేఅవుట్ స్థలంలో మొత్తం 7 ప్లాట్ల మేర అమ్మేసి సొమ్ము చేసుకుందామని మంతనాలు జరిపినట్లు భగత్‌సింగ్‌నగర్‌లో పెద్ద చర్చనీయాశంగా మారింది. సదరు నేత ఆదేశాలతోనే గాజులరామారం డీసీ ఫెన్సింగ్ వేయడంలో నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నాడని భగత్‌సింగ్‌నగర్‌లో చర్చించుకుంటున్నారు. సదరు నేతతో భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘంలోని కొంతమంది నేతలు, జేఏసీ నేతలు ధోబీఘాట్ వాసులతో పలుమార్లు ప్లాట్ల అమ్మకం విషయంలో చర్యలు సాగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.


ధోబీఘాట్‌లో అక్రమంగా వెలసిన భవనాలు

ఈ స్థలంలో ఆస్పత్రి, మార్కెట్ నిర్మించాలి..



1997 అప్రూవల్ ప్రకారం 2007, జీహెచ్‌ఎంసీ సర్వే 2019 లేఅవుట్ ప్రకారం అధికారులు ఫెన్సింగ్ వేయాల్సిందే. ఇక్కడ 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలి. అదే విధంగా స్టార్‌లైట్ వెనుక ఉన్న 30గుంటల స్థలంలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి స్థల సేకరణ పూర్తయ్యింది. ఈ రెండు స్థలాలలో ఎవరైనా అక్రమంగా ప్లాట్లు అమ్మినా.. కొన్నా చట్టం ముందు దోషులుగా నిలబడతారు. గతంలో 5 బేస్‌మెంట్లు నిర్మిస్తే అధికారులు కూల్చివేసిన విషయం గుర్తించుకోవాలి. గాజులరామారం డిప్యూటీ కమిషనర్ ఫెన్సింగ్ వేయడంలో నిర్లక్ష్యాన్ని వీడాలి.

– కేఎం ప్రతాప్, మాజీ డీసీసీ

నేటి నుంచి మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం

నిజాంపేట్: భౌరంపేట్ ఇందిరమ్మకాలనీలోని శ్రీదాసాంజనేయ స్వామి సహిత మల్లికార్జునస్వామి 2వ వార్షికోత్సవం ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు వనిత బుచ్చిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవంతో పాటు సోమవారం నుంచి బుధవారం వరకు జాతర మహోత్సవం ఉంటుందన్నారు. 19 తేదీన మహా గణపతి పూజ, రక్షాబంధనం, నవగ్రహ మంటప ఆరాధన, ప్రధాన కలశ ఆరాధన, మహామంగళ హారతి, తీర్థప్రసాద వితరణ, 20న గణపతి పూజ, గౌరిపూజ, అగ్నిప్రతిష్ఠ, మన్యుహోమం, ఆంజనేయ మూల మంత్రంతో హోమం, అష్టోత్తర శత(108)కలశాలతో ఆంజనేయస్వామి వారికి కుంభాభిషేకం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నేడు ఛత్రపతి శివాజీ పురస్కార్ ప్రదానోత్సవం

చింతల్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని అయోధ్య కరసేవకులను సన్మానించనున్నట్లు భాగ్యనగర్ శివాజీ సేవా సమితి ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 19న సాయంత్రం 5గంటలకు రంగారెడ్డినగర్‌లోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసే కార్యక్రమంలో 1990–92 సంవత్సరాల్లో అయోధ్య కరసేవకులందరికీ ఛత్రపతి శివాజీ పురస్కార్ అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం మార్చిలో కరసేవకులందరిని కాశీ, అయోధ్య దర్శనాలకు తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారుల సమ్మిట్

బంజారాహిల్స్: ప్రాంతీయ ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారుల సమ్మిట్ లోయల్ ట్యాంక్‌బండ్‌లోని మారియట్ హోటల్‌లో జరిగింది. సెక్టోరల్, ఎంఎంస్‌ఎంఈ ఉత్పత్తుల ఎగుమతుల సామర్థ్యంపై అధ్యయనం చేయడంతో పాటు వాణిజ్య ఒప్పందాలు, ఎంఎంస్‌ఎంఈలకు నిర్దిష్ట హెచ్‌ఎస్‌ఎన్ కోడ్ తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి. ఎంఎస్‌ఎంఈ ఎగుమతుల కోసం విజయవంతమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించడమే లక్ష్యంగా సమ్మిట్ కొనసాగింది. అలాగే ఎగుమతులకు సంబంధించిన సవాళ్లపై ఉత్పత్తిదారులు అనేక విషయాలను పరస్పరం పంచుకున్నారు. భారతదేశపు మొదటి సామూహిక ఎగుమతి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రెండు లక్షల ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారులను ప్రారంభించే లక్ష్యంగా ఇండియా ఎస్‌ఎంఈ ఫోరం ఈ సమ్మిట్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 200లకు పైగా ఎంఎస్‌ఎంఈలు, ఔత్సాహిక ఎగుమతిదారులు పాల్గొన్నారు.

కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల ప్రతిజ్ఞ

బంజారాహిల్స్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించేది లేదంటూ ట్రాఫిక్ పోలీసులు కూడళ్ల వద్ద ప్రతిజ్ఞ కొనసాగిస్తున్నారు. తమ విధులను గుర్తుచేసుకుంటూ వాటిని సక్రమంగా నిర్వర్తించే విధంగా ట్రాఫిక్ సిబ్బంది ప్రతిజ్ఞ ద్వారా ఉత్తేజాన్ని పొందుతున్నారు. అందులో భాగంగా ఆదివారం జూబ్లీహిల్స్ చౌరస్తాలో ఎస్‌ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు కూడలిలో ప్రయాణికులకు కనబడే విధంగా ఉండి ప్రతిజ్ఞ చేశారు.

వరలక్ష్మికి గౌరవ డాక్టరేట్

హిమాయత్‌నగర్ : విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న నగరానికి చెందిన వరలక్ష్మికి గౌరవ డాక్టరేట్‌ను అమెరికాకు చెందిన కేంబ్రిడ్జ్ ఆన్‌లైన్ యూనివర్సిటీ ప్రదానం చేసింది. తాజాగా ఢిల్లీలో నిర్వహించిన ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పద్మశ్రీ జితేందర్ సింగ్ షంటి చేతుల మీదుగా ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శం

ఉస్మానియా యూనివర్సిటీ: మాలలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శమని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నాను సైదులు పేర్కొన్నారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హైదరాబాద్ నిజాం సంస్థానంలో విద్యా మంత్రిగా పనిచేసి దళిత బాలికల కోసం 26 పాఠశాలలను స్థాపించి మహిళల విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. భాగ్యరెడ్డి వర్మను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుర్గం వినోద్, కరుణకర్, గోవర్ధన్, హరికృష్ణ, నగేష్ పాల్గొన్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి



హిమాయత్‌నగర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఇంక్విలాబ్ సేన జాతీయ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. ఆదివారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్షులు జానీ, ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.హుస్సేన్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఇంక్విలాబ్ సేన పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై డ్రోన్లతో టియర్ గ్యాస్ షెల్స్ కాల్చడం దుర్మార్గమైన చర్యలు అవలంభిస్తుందన్నారు. రైతుల డిమాండ్లపై కేంద్రం చర్చలకు ఆహ్వానించాలని కోరారు. సమావేశంలో ఇంక్విలాబ్ సేన ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాజేష్,నాయకులు వినోద్, యాదయ్య, నరేష్, లక్ష్మి, ఫర్జానా, ఆషియా రుక్సేనా తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో చెత్త వసూలు రూ. కోటి!

- బాండ్ పేపర్లు రాసి ఏరియా కేటాయిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

చెత్త కార్మికులపై ప్రైవేట్ వ్యక్తుల ఆదిపత్యం


చెత్త కార్మికుడు పరమేష్‌కు బాండ్ పేపర్ అందజేస్తున్న మల్లికార్జున్, గోపి


కార్మికుడికి రాసి ఇచ్చిన బాండ్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో చెత్త సేకరించే కార్మికుల నుంచి కార్మిక నాయకులుగా చెలామణి అవుతున్న కొంత మంది వసూళ్లకు పాల్పడుతూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారా? ఒక వేళ కార్మిక నాయకుల మాటా వినకపోతే చెత్త సేకరించే కాలనీల్లో రెండు మూడు ఆటోలు పెట్టించి కార్మికుల మధ్య వివవాదం సృష్టించడం తిరిగి ఆ వివాదాన్ని పరిష్కొస్తున్నట్లు చేసి తిరిగి కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతే కాకుండా అవసరం అయితే భౌతిక దాడులకు సైతం పాల్పడటం పరిపాటిగా మారింది. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 200 చెత్త ఆటోలు ప్రతి రోజు ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల నుంచి చెత్తను సేకరిస్తున్నారు.

ప్రైవేట్ వ్యక్తులదే హవా..?

◆ నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఆటో నడపాలంటే కార్మికులుగా చెలమని అవుతున్న కొందరి అనుమతి తప్పనిసరి. ఎక్కడైన మున్సిపల్ అధికారుల అనుమతి ఉండాలి కాని ఇక్కడ మాత్రం విరుద్ధంగా కార్మిక నాయకుల అనుమతి ఇవ్వాల్సిందే. అంతే కాదు చెత్త సేకరించేందుకు ఆటో నడిపించేందుకు కార్మికుడికి బాజాప్తాగా బాండ్ పేపర్ రాసి అనుమతి ఇస్తారు. కాని ఇందులో సదరు కార్మికుడి నుంచి తీసుకున్న డబ్బుల విషయం మాత్రం నమోదు చేయకపోవడం విశేషం.

◆ ఇలా వసూలు చేసిన డబ్బులు అధికారులకు సైతం ఇవ్వాల్సి ఉంటుందని ఈ ప్రైవేటు వ్యక్తులు కార్మికులకు చెబుతున్నట్లు సమాచారం. ఇక్కడ ఈ నాయకులు చెప్పినంత ముట్టజెప్పాల్సిందే. లేదంటే ఆటోకు చెక్ పెడతారు. మరి ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించిడం లేదు. ఎందుకు ఈ అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోలేకపోతున్నారో అర్థం కావడం లేదని పలువురు చెత్త కార్మికులు వాపోతున్నారు.

◆ ప్రైవేటు వ్యక్తుల చేతిలో మున్సిపల్ కార్పొరేషన్‌లోని కాలనీలు, బస్తీలు ఉండటమేంటని.? ప్రైవేటు వ్యక్తుల ఆదిపత్యమేందని పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. చెత్త సేకరణ కార్మికుల నుంచి వసూలు చేసిన సొమ్ము సుమారు కోటి రూపాయాల వరకు ఉంటుందని పలువురు పేర్కొనడం గమనర్హం. ఇటీవల పరమేష్ అనే చెత్త కార్మికుడిపై ఓ కార్మిక నాయకుడిగా చెలమని అవుతున్న మల్లికార్జున్ అనుచరులు కత్తులతో దాడులు చేయగా గతంలో ఈ పరమేష్‌కు బాండ్ పేపర్‌పై ఏరియా రాసి ఇస్తున్నట్లు మల్లికార్జున్, గోపిలతో పాటు మరి కొంత మంది ఉండటం విశేషం.

అధికారులు నియంత్రించలేరా.?


◆ చెత్తకార్మికులకు ఏరియా కేటాయించడం కాని, వారిచే ప్రతి రోజు చెత్తసేకరణ చేయించడం మున్సిపల్ అధికారులు చేయించలేరా? లేక ఈ ప్రైవేటు వ్యక్తులను పెంచి పోషిస్తున్నది అధికారులేనా. అనే అనుమానాలు అటు కార్మికులతో పాటు ప్రజలు సైతం వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ అలా కానప్పుడు ఇద్దరు ముగ్గరు కార్మికుల నాయకుల బ్లాక్ మెయిల్‌కు తలోగ్గాల్సిన అవసరం అధికారులకు ఏముంది.?

ఆరోపణలకు చెక్ పెడతారా?...

◆ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త ఆటోలపై ఆదిపత్యం చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు వ్యక్తులతో అధికారులు కుమ్మకయ్యారనే ఆరోపణలకు చెక్ పెట్టాలంటే అధికారులే చెత్త కార్మికులకు కాలనీల్లో ఒక్కో కార్మికుడికి నిర్ధిత ఇండ్లు కేటాయించి... సరైన గుర్తింపు కార్డులు జారీ చేయాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా ఆరో కార్మికులపై ప్రైవేటు వ్యక్తుల ఆదిపత్యాన్ని నియంత్రించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు. లేని పక్షంలో ప్రతి రోజు కార్మికుల మధ్య గొడవలు జరగడం వాటిని పరిష్కారం చేస్తున్నట్లు పంచాయతీలు పరపాటిగా జరుగుతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దేవుడి భూములకు రక్షణ

- కొత్త ప్రభుత్వం ఆదేశాల నేపథ్యం లో కసరత్తు
- గ్రేటర్‌సహా శివారు జిల్లాల్లో 21,386 ఎకరాల దేవాదాయ భూములు
- కబ్జాదారుల ఆధీనంలో 5,462 ఎకరాలు
- కోర్టుల్లో వివాదాల్లో 760 కేసులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని దేవాదాయ, ధర్మాదాయ భూముల పరిరక్షణకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికార యంత్రాంగం దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక కార్యాచరణకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే దేవాలయాల వారిగా సంబంధిత భూములపై సమగ్ర సమాచారంపై ఆరా తీస్తున్నారు. కబ్జాదారుల ఆక్రమణలో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించిన కోర్టు కేసులను పునః పరిశీలించడంతోపాటు త్వరలో పరిష్కారం అయ్యేలా తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలపై కూడా కార్యాచరణ రూపొందించాలని యంత్రాంగం భావిస్తోంది.

ఆక్రమణలో 5,462 ఎకరాలు

గ్రేటర్‌తో సహా రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో మొత్తంగా దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు 21,386 ఎకరాలు ఉండగా, ఇందులో 5,462 ఎకరాల భూములు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఇందుకు ఉదాహరణగా మేడ్చల్ జిల్లాలోని దేవరయాంజల్‌లో సీతారామచంద్రస్వామి భూముల కబ్జాను సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వివిధ కోర్టుల్లో 760 కేసులు

నగర శివారుల్లో కబ్జాదారుల ఆక్రమణల్లో ఉన్న దేవాదాయ భూములకు సంబంధించి 760 కేసులు వివిధ కోర్టుల్లో కొనసాగుతుండగా, వాటి పరిరక్షణపై ప్రత్యేక కసరత్తు చేస్తోంది. గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో ఇప్పటి వరకు 2,352 ఎకరాల భూములను వివిధ పద్ధతుల్లో పరిరక్షిస్తున్న దేవాదాయ శాఖ.. ముందస్తుగా తమ ఆధీనంలో ఉన్న భూముల రక్షణకు ఫెన్సింగ్ వంటి పటిష్టమైన చర్యలకు సిద్ధం కావాలని భావిస్తోంది.

దేవాదాయ భూములివే..

దేవాదాయ భూములకు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో 5,217 ఎకరాలు ఉండగా, దీనికి సంబంధించిన భూములు మనరాష్ట్రంలో 2,500 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 354 ఎకరాల భూములు భద్రంగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 9,929 ఎకరాలు దేవాదాయ భూములు ఉండగా, మేడ్చల్ జిల్లాలో 3,941 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 2,299 ఎకరాలు దేవాదాయ శాఖ భూములు ఉన్నట్లు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల నేపథ్యంలో తమ ఆధీనంలో ఉన్న భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ ప్రత్యేక చర్యల్లో భాగంగా ఫెన్సింగ్ వంటి కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని భావిస్తోంది.